క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటకు చెందిన వీరపాగ రాములు వారం క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ సోమవారం ఉమ్మడి మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డితో కలిసి ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి పంపిన రూ.5వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం రావుల బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గోల్డ్ బాలస్వామి, నాయకులు అఖిల్, జుర్రు వెంకటేష్, భీష్మ, సీతారాములుగౌడ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఆత్మకూర్: పట్టణంలోని అక్షర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలను బోధించారు. 20 మంది విద్యార్థులు బోధన ఉపాధ్యాయులుగా బాధ్యతలను నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు దామోదర్, మహేష్, నాగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఆత్మకూర్: అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆత్మకూర్ పట్టణానికి చెందిన శ్వేత కుటుంబ సభ్యులకు రూ.60 వేలు చెక్కును అందజేసారు. కార్యక్రమంలో మండ్లరామకృష్ణ, గడ్డమీది శ్రీను, మోసీన్ తదితరులు ఉన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో శివాలయం నిర్మాణానికి సోమవారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

పెద్దమ్మగుడికి..

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లకి చెందిన పెద్దమ్మ గుడిని నూతనంగా నిర్మించడానికి సోమవారం సర్పంచ్ నాగరాజుతో కలిసి నిర్మాణ దాతలు మోహన్‌రావు, సురేందర్‌రావులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత ఖర్చులతో గుడి నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రజిత, వార్డుమెంబర్లు రామస్వామి, చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ నిరంజన్‌రావు, మాజీ సర్పంచ్ రంగస్వామి, నాగరాజు, ఖాదర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ



వనపర్తి: జిల్లా కేంద్రంలోని నందవరం చౌడేశ్వరిమాత వృద్ధాశ్రమంలో సోమవారం భారత్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం జాగృతి జిల్లా అధ్యక్షుడు చీర్ల సత్యం ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరవింద్, మాలతి, వృద్ధులు నాగప్ప, ఎల్లన్న, లక్ష్మన్, రామయ్య, పార్వతమ్మ, రమాదేవి, యశోదమ్మ, కిష్టమ్మ తదితరులు ఉన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని రామాపురంలో అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్ భారతి చేతుల మీదుగా అంబలి కేంద్రాన్ని పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్ట్ సేవా సంస్థ ఇన్‌చార్జ్ అర్జున్‌గౌడ్, పాఠశాల చైర్మన్ శిరీష, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, రామస్వామి, దర్గయ్య పాల్గొన్నారు

మహిళల అభ్యున్నతికి కృషి

- మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు వంటల పోటీలు
- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా

అమరచింత: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ కుటుంబాలను ఆర్థిక పురోగతిలో ముందుకు తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సోమవారం వంటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ మహిళా సమాఖ్య తరఫున అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పొదుపు సంఘాల మహిళలకు వంటల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. వంటల పోటీలో ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందిస్తున్నా న్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు తిండి పదార్థాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అలాంటి సందర్భాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు సంఘాల సభ్యులు మంచి రుచికరమైన తిండి పదార్థాలను తయారు చేసి విక్రయించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. దీంతో పాటు క్యాటరింగ్ వసతిని నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన వారికి మున్సిపల్ ఆధ్వర్యంలో స్థలాలను కేటాయించి వారి ఆర్థిక పురోగతికి సహకరిస్తామని భరోసానిచ్చారు.

స్వచ్ఛతపై దృష్టి పెట్టండి

మహిళలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తలను వేరు చేసి తమ కాలనీకి వస్తున్న చెత్త ట్రాక్టర్లకు అందించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబర్చిన మహిళలకు మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత ఉత్సవ్–2023 పేరుతో అవార్డులతో సత్కరించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, స్టార్టప్, ఎన్‌జీఓతో పాటు సామాజిక టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సర్వీస్ వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, రవాణాలతో పాటు చెత్తతో కళాకృతులు చేసే రంగాల మహిళలు 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలను సెల్ నంబర్ 63611 83912 లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, కౌన్సిలర్లు విజయరాములు, లావణ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, మెప్మా కోఆర్డినేటర్ యువరాజు, పట్టణ సమాఖ్య కార్యదర్శి నాగమణి, ఆర్పీలు సంగీత, రాజేశ్వరి, ఖాజా, గోపాల్ బ్యాంకు మిత్ర కమల తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వనపర్తి క్రైం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి గోకం వంశీ విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో విద్యా విధానంలో ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయటం లేదని మండిపడ్డారు. ఫీజు నియంత్రణ చట్టం పటిష్ఠంగా అమలు చేయటం లేదని అసహనం వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టాన్ని పట్టించుకోవడం లేదని, కేజీ టూ పీజీ విద్య మాటకే పరిమితం అయ్యిందన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం జరుగుతోందని, కార్పొరేట్లకు కొమ్ముకాసే విధానాలకు స్వస్తి పలకాలని హితువు పలికారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన విద్య సంస్థల గుర్తింపు రద్దు చేయడం లేదన్నారు. విద్యకు 30శాతం నిధులు కేటాయించాలని, నామమాత్ర కేటాయింపులు సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరిస్తుందని, భగవద్గీత శ్లోకాలను పాఠ్యాంశాల్లో చేర్చటం లౌకికతత్వానికి విరుద్ధమని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పవన్, మధు, ఉపేందర్, వంశీ, మహేందర్, భానుసాగర్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కోమారి బాలస్వామి(59) రోడ్డు ప్రమాదంలో గాయపడి, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలస్వామి ఫిబ్రవరి 18న బండపల్లి సమీపంలో బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



కరాటే విద్యార్థులతో మాస్టర్లు

కొత్తకోట: ఇటీవల జడ్చర్ల, వనపర్తి పట్టణాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. బాలిక కటాస్ విభాగాల్లో అండర్–16 లో హర్షిణి బంగారు పతకం, అండర్–13 విభాగంలో మేఘన బంగారు పతకం, రాజేశ్వరి వెండి పతకం, బాలుర కటాస్ విభాగంలో అండర్–9లో సుశాంత్, కార్తికేయ, సృజన్, తేజ్ వెండి పతకం సాధించారు. అదేవిధంగా కుమ్మితే విభాగంలో అండర్–7లో ప్రవీణ్‌యాదవ్ బంగారు పతకం, బన్నీ వెండి పతకం, అండర్–10లో విజయ్‌కుమార్ బంగారు పతకం, సుశాంత్ వెండి పతకం, అండర్–13లో సాత్విక్ గౌడ్, భానుప్రకాష్ వెండి పతకాలు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు వనపర్తి మున్సిపాలిటీ చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ వాకిటీ శ్రీధర్, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ జాంగీర్ పాష చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్లతో సత్కరించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15వ తేదీ నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పరీక్షలు 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరంలో 89 మంది, ద్వితీయ సంవత్సరంలో 74 మంది కలిపి మొత్తం 163 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలన్నారు.

బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన



బ్రహ్మంగారి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనను భక్తులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు యాదగిరిగౌడ్ మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ నాటక ప్రదర్శనను గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, పంతులు జానకీరాములు, లక్ష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదవరెడ్డి, నాగేంద్రం, హనాన్, దత్తాత్రేయరెడ్డి, మన్నెపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు ఇవ్వాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆసరా పింఛన్‌దారులు

అమరచింత: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సకాలంలో ఆసరా పింఛన్లు అందించి ఆదుకోవాలని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వామపక్షాల నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 5వ తేదీ లోపు ఆసరా పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరంలో ఒక నెల పింఛన్ ఇవ్వటం లేదని వాపోయారు. కుటుంబ సభ్యుల ఆదరణ లేని వారికి పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఇప్పటికైనా సకాలంలో ఆసరా పింఛన్లు చెల్లించాలని ఎంపీడీఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్యాం సుందర్, బుచ్చన్న, సామేలు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లి సమీపంలో మలుపు వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి కిందపడడంతో ఓవ్యక్తికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు చెందిన బొక్కలయ్య మోటారు సైకిల్‌పై శ్రీరంగాపురం గ్రామానికి వెళ్తుండగా కంచిరావుపల్లి మలుపు వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడింది. దీంతో బొక్కలయ్యకు రక్త గాయాలు కావడంతో అతని వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

మహాధర్నాకు బయల్దేరిన ట్రాన్స్‌కో ఉద్యోగులు



ధర్నాకు వెళ్తున్న ట్రాన్స్‌కో ఉద్యోగులు

గోపాల్‌పేట: ట్రాన్స్‌కో ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం ట్రాన్స్‌కో ఉద్యోగులు, ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించేందుకు తలపెట్టిన వరంగల్ మహాధర్నాకు సోమవారం సాయంత్రం గోపాల్‌పేట నుంచి బయల్దేరి వెళ్లారు. స్టార్టింగ్ మాస్టర్ స్కేల్‌ను ఆర్టిజన్ గ్రేడ్–4ను వర్తింపజేయాలని, ఆర్టిజన్స్‌కు ప్రస్తుతం ఉన్న బేసిక్ పే లో రూరల్ పర్సనల్ పే ను కలిపాక యాభైశాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, కేవలం పర్సనల్ పే ను బేసిక్ పే కలిపి ఎంతో కొంత పర్సెంట్‌తో సరిపెట్టుకోమంటే ఆర్టిజన్లకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్‌లకు పీఆర్సీ అమలు చేయాలనే 29 డిమాండ్ల పరిష్కారానికి వరంగల్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆఫీస్ ఎదుట తలపెట్టబోయే ధర్నాలో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజర్ నరేందర్, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శేఖర్, అంజి, వేణు, శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు ఘన నివాళి



వనపర్తిలో మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో..

వనపర్తి టౌన్: రామాయణంలో ఆరు కాండాలను 847 పద్యాలతో రచించిన గొప్ప రచయిత్రి ఆతుకూరి కుమ్మరి మొల్ల అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ గుర్తుచేశారు. మొల్ల జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొల్ల రచనలు సమాజానికి ఆదర్శం అని కొనియాడారు. నేటి యువ రచయితలు మొల్లను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, కవి ఈశ్వర్, నాగరాజు, మండ్ల దేవన్న నాయుడు, వెంకటస్వామి, పరమేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలో తొలితెలుగు మహిళా కవయిత్రి కుమ్మర మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోఆమె చిత్రపటానికి కుమ్మరి సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు పరశురాం, పట్టణ అధ్యక్షుడు గుణగంటి తిరుపతి, కార్యదర్శి రవి, సభ్యులు నరసింహ, తిరుపతయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

బుసిరెడ్డిపల్లిలో..

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సూర్యవంశం మొగులయ్య, రాము, చిన్ననర్సింహ, చంద్రయ్య, రామకృష్ణ, రాముడు, గోపాల్, చిన్నరాముడు, కొండయ్య పాల్గొన్నారు.

ప్రమాదకర రాళ్ల తొలగింపు

కోడేరు: మండల కేంద్రంలోని పస్పులకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పెద్ద బండరాళ్లు ఉండటంతో తరచూ అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో తన సొంత ఖర్చులతో ప్రధాన రోడ్డు అంచున ఉన్న రాళ్లను తొలగించారు. ఇదే స్థలంలో రాళ్లను ఢీకొని ముగ్గురు మృత్యువాత పడ్డారని, నలుగురు ద్విచక్ర వాహనదారులు కింద పడి కాళ్లు, చేతులు విరిగిపోయాయని అన్నారు. ప్రమాదకరంగా ఉన్న రాళ్లను తొలగించడంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు. అదే విధంగా ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో మాట్లాడి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రఘువర్ధన్‌రెడ్డి తెలిపారు.



తవ్వారు.. వదిలేశారు



అమరచింతలోని రెండో వార్డులో అసంపూర్తిగా వదిలేసిన డ్రెయినేజీ నిర్మాణం

అమరచింత: పట్టణంలోని రెండో వార్డులో నూతన డ్రెయినేజీ నిర్మాణం కోసం వీధిలో రహదారిని తవ్వారు. కాల్వ నిర్మాణం కోసం తవ్విన ప్రదేశంలో సిమెంట్‌తో బెడ్ వేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు చేపట్టడం లేదు. దీంతో కాలనీవాసులు స్థానిక కౌన్సిలర్ లావణ్య ప్రశ్నించగా.. కాల్వ నిర్మాణం కోసం అంచనా జరగలేదని, దీని కోసం మున్సిపల్ చైర్‌పర్సన్, ఏఈకి విన్నవించామన్నారు. రెండో వార్డులోని గొల్ల విష్ణువర్ధన్‌యాదవ్ ఇంటి నుంచి మురుగు కాల్వ నిర్మాణం కోసం తవ్విన ప్రాంతంలో నూతన డ్రెయినేజీని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. తవ్వి వదిలివేయడంతో రాత్రుల్లో వృద్ధులు, చిన్నపిల్లలు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'



ఈర్లదిన్నెలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమరచింత: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం కంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా అందిస్తోందని మండల రైతు సమితి అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో సోమవారం సర్పంచ్ చుక్క లక్ష్మమ్మతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంత ప్రజల కోసం గ్రామాల్లోనే ఉచిత నేత్ర శిబిరాలను నిర్వహించేందుకు కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. మొత్తం 128 మందికి పరీక్షలు నిర్వహించగా.. వీరిలో 18 మందికి అద్దాలను పంపిణీ చేశారు. 12 మందికి కంటి అద్దాల కోసం బుకింగ్ చేశామన్నారు. 11 మందికి ఆపరేషన్లకు సిఫారసు చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సార్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, సత్యమ్మ, ఏఎన్ఎం హైమవతి, డీఓ గోపాల్‌నాయక్, పార్వతి పాల్గొన్నారు.

195 మందికి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 195 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో 15 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని, 31 మందికి అవసరమైన అద్దాల తయారీకి పంపిచామన్నారు. 18 మందిని ఆపరేషన్ అవసరం ఉన్న వారీగా గుర్తించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి తెల్లరాళ్లపల్లితండాలో..

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో మంగళవారం నుంచి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. 18ఏళ్లు పైబడిన వారందరూ కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలన్నారు. తండాతో పాటు దావాజిపల్లి, రేమద్దుల గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు కొనసాగుతాయన్నారు. అవసరమైన వారికి అద్దాలు అందిస్తామని తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు



వీపనగండ్లలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ పద్మావతి



ఖిల్లాఘనపురంలో..



పెబ్బేరులో..

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. స్థానిక పోలింగ్ కేంద్రంలో మొత్తం 106 ఓట్లు ఉండగా.. 105 ఓట్లు పోలయ్యాయి. పీఆర్టీయూ టీఎస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: స్థానిక పోలింగ్ కేంద్రంలో మొత్తం 11 ఓట్లు ఉండగా.. మధ్యాహ్నం వరకే 11 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో వంద శాతం ఓటింగ్ పూర్తయినట్లు తహసీల్దార్ భానుప్రకాష్ ప్రకటించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ శ్రీహరి సిబ్బందితో భద్రత కల్పించారు.

వీపనగండ్లలో 89శాతం పోలింగ్

వీపనగండ్ల: మండల కేంద్రంలో 54 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. మొత్తం 61 ఓట్లకు గాను 89 శాతం ఓట్లు పోలయినట్లు ఆయన పేర్కొన్నారు. పోలింగ్ సరళిని వనపర్తి ఆర్డీఓ పద్మావతి, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక ఎస్ఐ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్త్ ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే రూట్ ఆఫీసర్ స్వరంజిత్‌సింగ్ పోలింగ్ బాక్స్‌లను హైదరాబాద్‌కు తరలించారు.

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆత్మకూర్, అమరచింత మండలాలకు సంబంధించి మొత్తం 92 మంది ఓటర్లు ఉండగా.. 85 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్‌రావు, ఏఎస్ఐ బీచుపల్లి, ఆర్ఐలు జయమ్మ, నర్సింహులు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ ఉన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 66 మంది ఓటర్లు ఉండగా.. 63 మంది ఉపాధ్యాయులు ఓటు వేశారని సిబ్బంది తెలిపారు. కేంద్రం వద్ద పెబ్బేరు ఎస్ఐ జగదీశ్వర్, శ్రీరంగాపూర్ ఎస్ఐ కేటీ మల్లేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.